# కలం

ప్రజల గళం...

kalamdaily.com

Follow on: Kalamtelugu


మంగళవారం • 31-03-2026

పేజీలు: 2

360° SINGLE TOPIC

రూపాయి మారకం


| | డాలర్‌తో రూపాయి విలువ | పెట్రోల్ (లీటర్) | డీజిల్ |
|---|---|---|---|
| స్వాతంత్ర్యం వచ్చినప్పుడు (1947) | 3.30 | 27 పైసలు | 18 పైసలు |
| ఇందిరాగాంధీ హయాంలో (1970) | 7.50 | రూ. 1.02 | 55 పైసలు |
| వాజ్‌పేయ్ హయాంలో (1999) | 43.40 | రూ. 24 | రూ. 13.91 |
| మన్మోహన్ హయాంలో (2004) | 45.30 | రూ. 35 | రూ. 22 |
| మోదీ ఫస్ట్ టర్మ్‌లో (2014) | 58.70 | రూ. 73 | రూ. 57 |
| మోదీ సెకండ్ టర్మ్‌లో (2019) | 70.40 | రూ. 80 | రూ. 74 |
| ప్రస్తుతం (2026) | 95.22 | రూ. 107.50 | రూ. 95.65 |



# ఈ పతనం ఎందాక?

## పడిపోతున్న రూపాయి విలువ

**చరిత్రలో ఫస్ట్ టైమ్ 95 మార్క్ క్రాస్**

**100 మార్క్‌ను చేరొచ్చంటున్న ఆర్థికవేత్తలు**

**ఇప్పటికే దడపుట్టిస్తున్న నిత్యావసర వస్తువుల ధరలు**

**మరింత పెరిగే చాన్స్..**

**కట్టడి చర్యలు లేకపోతే కష్టమే**

**ఇన్నేండ్లలో ఎన్నడూ లేనంత ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి విలువ పడిపోయింది. సెంచరీ మార్క్‌కు చేరువలో ఉంది. మోదీ సర్కార్ కొలువు దీరినప్పటి నుంచి క్రమంగా రూపాయి విలువ పడిపోతూనే ఉంది. 2014లో 60 మార్క్ దగ్గర ఉన్న దేశ కరెన్సీ.. ఇప్పుడు ఏకంగా 95 మార్క్‌ను టచ్ చేసింది. ఈ ప్రభావం ఇప్పటికే మార్కెట్‌లో పప్పు, ఉప్పు, నూనె నుంచి మొదలు.. నెలవారీ జీతంపైనా పడుతున్నది. బయట ఏది కొందామన్నా భగ్గుమంటున్నది. ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. ఇరాన్ వార్ ఎఫెక్ట్‌తో గ్యాస్, పెట్రోల్ కొరత వల్ల తిప్పలు పడుతున్న సగటు జీవికి.. రూపాయి విలువ పడిపోవడం మరింత కష్టాలను తెచ్చిపెట్టనుందా? ద్రవ్యోల్బణం మరింత పెరిగి ఇండియన్ ఎకానమీ డిస్ట్రబ్ కానుందా?!**

**ఈ పతనం ఎటువైపు దారి తీయనుంది..! రూపాయి ఇలా పడటానికి కారణాలు ఏమిటి? వీటన్నింటిపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం..**

**- బిజినెస్ బ్యూరో, కలం**


రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే గత కొన్ని రోజులుగా భారీగా పతనమవుతున్నది. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం, బ్యారెల్ క్రూడాయిల్ ధర 116 డాలర్లు దాటడం, డాలర్ ఇండెక్స్ పెరగడం, విదేశీ ఇన్వెస్టర్లు భారత్ నుంచి పెట్టుబడులు ఉప సంహరించుకుంటుండటంతో రూపాయి విలువ పడిపోతున్నది. సోమవారం 95.22తో ఆల్ టైమ్ కనిష్టానికి జారిపోయింది. బ్యాంకులు తమ వద్ద ఉంచుకునే విదేశీ కరెన్సీ ఎక్స్‌పోజర్‌పై ఆర్బీఐ 100 మిలియన్ల పరిమితి విధించింది. దీంతో బ్యాంకులు తమ వద్ద ఉన్న డాలర్లను విక్రయించాల్సి వస్తుంది. ఇది రూపాయికి కొంత బలం ఇస్తుందని ఆర్బీఐ భావించినప్పటికీ రూపాయి పతనం ఆగలేదు. గత శుక్రవారం చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయి 94.81 వద్ద ముగిసిన రూపాయి.. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయంతో సోమవారం ఉదయం స్వల్పంగా బలపడినా సాయంత్రానికి రూపాయి విలువ 95కు పతనమైంది.

### నష్టపోయే రంగాలు

- ఇండియా తన అవసరాలకు 80-85% ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది. రూపాయి పడిపోతే, డాలర్లలో చెల్లింపులు భారమవుతాయి. దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి రవాణా ఖర్చులు, తద్వారా నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి.
- మనం వాడే స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల విడిభాగాలు ఎక్కువగా దిగుమతి అవుతాయి. రూపాయి బలహీనపడితే ఈ వస్తువుల ధరలు 5-10 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.
- విమాన ఇంధనం ధరలు పెరగడమే కాకుండా, విమానాల లీజు చెల్లింపులు డాలర్లలో ఉంటాయి. దీనివల్ల విమాన టికెట్ల ధరలూ భారం కావొచ్చు.
- వ్యవసాయానికి అవసరమైన ఎరువుల దిగుమతి ఖర్చు పెరుగుతుంది. ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో వాడే కొన్ని ప్రత్యేక ముడి పదార్థాల ధరలు పెరిగి ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది.
- విదేశాల్లో చదువుకునే విద్యార్థుల ఫీజులు, అక్కడి నివాస ఖర్చులు భారీగా పెరుగుతాయి.

### ఎందుకిలా..!

- ఇరాన్, అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయంగా అనిశ్చితిని పెంచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 116 డాలర్లు దాటిపోవడం.. ఇండియా వంటి దిగుమతులపై ఆధారపడే దేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది.
- ఒక్క మార్చిలోనే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రికార్డు స్థాయిలో సుమారు 1.14 లక్షల కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. ప్రపంచవ్యాప్తంగా డాలర్‌కు డిమాండ్ పెరగడంతో ఇతర కరెన్సీలతో పాటు రూపాయి కూడా బలహీనపడింది.
- యుద్ధం మరింత ముదిరితే 100 మార్క్‌ను చేరుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- రూపాయి విలువ వారంలో 1.92 శాతం, నెలలో 4.31 శాతం, 3 నెలల్లో 5.83 శాతం, 6 నెలల్లో 6.93 శాతం, ఏడాదిలో 11.07 శాతం, ఐదేండ్లలో 29.37 శాతం పడిపోయింది. 52 వారాల కింద డాలర్‌తో పోలిస్తే 83.76 ఉన్న రూపాయి విలువ.. సోమవారం నాటికి 95 దాటి 'ఆల్‌టైమ్ లో'కి జారిపోయింది.



## వాజ్ పేయి హయాంలో..!

### రూపాయి విలువ ఇలా..!



1998 నుంచి 2004 మధ్య అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో ఇండియా రూపాయి అక్కడక్కడే తిరిగింది. ఐటీ, సాఫ్ట్‌వేర్ అప్పుడప్పుడే ఊపందుకుంటున్నది. విదేశీ పెట్టుబడులు ప్రారంభమయ్యాయి. ఫారెక్స్ మార్కెట్ చాలా కంట్రోల్‌లో ఉంది. ఆర్బీఐ రెగ్యులేషన్స్ ఎక్కువ. డాలర్ తో పోలిస్తేనే రూపాయి విలువ 1998లో 41.26 నుంచి 41.33 మధ్య ఉంది. ఆ తర్వాత 2000 నాటికి 45కు పడిపోయింది. 2001లో 47.23.. 2002లో 48.. 2003లో కొంత పుంజుకుని 47 వద్ద స్థిరపడింది. 2004 నాటికి 45.30 వద్ద నిలిచింది. పోఖ్రాన్ 2 అణుపరీక్షలు (1998), ఆసియా ఆర్థిక సంక్షోభం (1997–98), కార్గిల్ యుద్ధం (1999), ఫారెక్స్ రిజర్వుల పెరుగుదల కారణంగా 1998లో డాలర్‌తో పోలిస్తే రూపీ విలువ 41 ఉంటే.. 2004 నాటికి 47 రూపాయలకు పడిపోయింది.

### పెట్రోల్, డీజిల్ రేట్లు ఇలా..!

పెట్రోల్, డీజిల్ విషయానికొస్తే.. 1998లో లీటర్ పెట్రోల్ రూ.23.94, డీజిల్ రూ.10.39 ఉంటే.. 2000 నాటికి పెట్రోల్ రూ.25కు, డీజిల్ 14కు పెరిగింది. 2004 నాటికి పెట్రోల్ రూ.39, డీజిల్ 26కు ఎగబాకింది.

## పని చేయని ఆర్బీఐ మంత్రం

ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ఫిబ్రవరి 28న మొదలైంది. అప్పటి నుంచి చూసుకుంటే రూపాయి విలువ దాదాపు 4.1 శాతం మేర పడిపోయింది. మార్చి 27వ తేదీన తొలిసారి 94.82 వద్ద ఆల్ టైమ్ లోను తాకింది. దీంతో రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపట్టింది. ప్రతి రోజూ ట్రేడింగ్ ముగిసే నాటికి ఆన్షోర్ మార్కెట్లో బ్యాంకులు 100 మిలియన్ డాలర్ల వరకే ఓపెన్ పొజిషన్లు ఉంచుకునేలా కొత్త రూల్స్ తీసుకొచ్చింది. అంతకు ముందు ఈ పరిమితి 1 బిలియన్ డాలర్ల వరకు ఉండేది. ఏప్రిల్ 10 నుంచి కొత్త రూల్స్ అమలులోకి రానున్నాయి. దీంతో సోమవారం ఉదయం రూపాయి విలువ కాస్త పుంజుకుంది. 128 పైసలు పుంజుకొని 93.57 వద్దకు పెరిగింది. కానీ, మార్కెట్లు ముగిసే నాటికి మళ్లీ భారీగా పడిపోయింది. తొలిసారి 95 మార్క్ దాటింది.

## మన్మోహన్ హయాంలో..!



### రూపాయి విలువ ఇలా..!

మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ 1, 2 హయాంలో (2004-2014) రూపాయి తీవ్ర ఒత్తిడికి లోనైంది. పదేండ్ల కాలంలో రూపాయి విలువ సుమారు 45 మార్క్ నుంచి 61 పైకి చేరుకుంది. 2004లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 45 ఉంటే.. 2005లో44, 2006లో 46.92, 2007లో 49.32, 2008లో 43.30, 2009లో 48.82, 2010లో 46.02, 2011లో 44.65, 2012లో 53.06కు చేరింది. ఆ తర్వాత 2013లో 54.78, 2014 నాటికి 61 మార్క్ ను టచ్ చేసింది. ఇదే అప్పట్లో అత్యంత కనిష్టం.

- 2004 నుంచి 2007 వరకు ఇండియాకు గోల్డెన్ డేస్‌గా ఉన్నాయి. ఆ తర్వాత 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం, 2011–12లో ఐరోపా దేశాల్లో ఆర్థిక సంక్షోభం, 2013లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ తన ఉద్దీపన పథకాలు ఉప సంహరించుకుంటున్నట్లు ప్రకటించడంతో ఇండియా నుంచి ఒక్కసారిగా విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. దీంతో 2014 నాటికి రూపాయి విలువ రూ.61కు పడిపోయింది.

### పెట్రోల్, డీజిల్ రేట్లు ఇలా..!


పెట్రోల్, డీజిల్ ధరల విషయానికొస్తే.. 2004లో లీటర్ పెట్రోల్ రూ. 35 ఉంటే.. డీజిల్ రూ.22గా ఉంది. ఆ తర్వాత 2006లో పెట్రోల్ రూ.43, డీజిల్ రూ.31కు పెరిగింది. 2009లో పెట్రోల్ రూ.48, డీజిల్ రూ.30.25, 2010లో లీటర్ పెట్రోల్ రూ.48, డీజిల్ రూ.38గా ఉంది. 2012లో పెట్రోల్ రూ.65.60, డీజిల్ రూ.40.91కు చేరుకున్నది. 2014 నాటికి పెట్రోల్ రూ.72, డీజిల్ 55 రూపాయలుగా ఉంది.

## మోదీ హయాంలో..!

### రూపాయి విలువ ఇలా..!

నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన 2014లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 61.02గా ఉంది. ఆ తర్వాత 2015లో 64.15, 2016లో 67.19కి పడిపోయింది. 2017లో 65.12 ఉంటే.. 2018 నాటికి 68.39కి క్షీణించింది. 2019లో 70.40ను టచ్ చేసింది.

- కరోనా టైమ్‌లో 2020లో 74.13, 2021లో 73.91కు రూపాయి విలువ పడిపోయింది. 2022లో 78.60 ఉండగా.. 2023నాటికి ఏకంగా 82.58 కనిష్టానికి జారింది. 2024లో 83.80, 2025 నాటికి 87.15కి పతనమైంది.
- ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్ తో 2026 మార్చి 30 నాటికి రూపాయి విలువ 95 క్రాస్ చేసి అత్యంత కనిష్టానికి పడిపోయింది.



### పెట్రోల్, డీజిల్ రేట్లు ఇలా..!


పెట్రోల్, డీజిల్ విషయానికొస్తే.. 2014లో పెట్రోల్ లీటర్ రూ.73 ఉంటే.. డీజిల్ రూ.57 ఉంది. 2015 నాటికి ధరలు తగ్గాయి. పెట్రోల్ రూ.60.50, డీజిల్ రూ.49.50గా ఉన్నాయి. 2016లో మళ్లీ పెట్రోల్ రూ.64.38, డీజిల్ రూ.53.20కు పెరిగాయి. 2018లో పెట్రోల్ రూ.75.60, డీజిల్ రూ.66.50, 2020లో పెట్రోల్ రూ.81.50, డీజిల్ రూ.72.40కు ఎగబాకాయి.

- 2022లో పెట్రోల్ రేట్ సెంచరీ దాటేసింది. లీటర్ పెట్రోల్ రూ.102.50కు చేరగా.. డీజిల్ రూ.92వద్ద ఉంది. 2023లో పెట్రోల్ రూ.110, డీజిల్ రూ.90 వద్ద ఉంది. 2024లో పెట్రోల్ రూ.105, డీజిల్ రూ.98, 2026 నాటికి లీటర్ పెట్రోల్ రూ.107, డీజిల్ రూ.95.70గా ఉంది.

### రూపీ విలువ పడితే ఏం జరుగుతుంది?

రూపాయి విలువ పతనం కావడం అనేది సామాన్యుడి జేబు నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ పునాదుల వరకు అన్నింటినీ ప్రభావితం చేస్తుంది.

- రూపాయి విలువ పడిపోతే దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతుంది. భారత్ తన వంట నూనె అవసరాల్లో దాదాపు 60% పైగా దిగుమతి చేసుకుంటుంది (ముఖ్యంగా పామాయిల్). రూపాయి బలహీనపడుతుండటంతో ఇప్పటికే దిగుమతి ఖర్చు పెరిగి ప్యాకెట్ ధరలు 20 నుంచి 30 రూపాయలు పెరిగాయి.
- కొన్ని రకాల పప్పులను మనం విదేశాల నుంచి తెచ్చుకుంటాం. వీటి ధరలు కూడా సామాన్యుడికి భారంగా మారాయి. దిగుమతుల కోసం మనం ఎక్కువ డాలర్లు ఖర్చు చేయాల్సి రావడంతో దేశ లోటు పెరుగుతున్నది.
- ఉద్యోగాలపైనా ప్రభావం పడుతుంది. నెలవారీగా వచ్చే సాలరీ టైమ్‌కు రాకపోవచ్చు. ఉన్న ఉద్యోగాలూ ఊడొచ్చు. ఇప్పటికే ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్ తో గ్యాస్, పెట్రోల్ కొరత వల్ల వీధి వ్యాపారులు రోడ్డుపాలవుతున్నారు. ఐటీ సెక్టార్ లో ఒడిదొడుకుల వల్ల ఐటీ జాబ్స్ పోతున్నాయి. రూపాయి మరింత క్షీణించడంతో ఉద్యోగాలపై ప్రభావం ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.




### పెరుగుతున్న ఈయూ కరెన్సీ విలువ

- ఒకవైపు రూపాయి పతనం అవుతుంటే, మరోవైపు యూరో విలువ గత కొన్ని నెలలుగా బలపడుతున్నది. డాలర్‌తో పోలిస్తే యూరో విలువ 1.12 నుంచి 1.15 స్థాయికి (అంటే ఒక యూరోకు 1.15 డాలర్లు) పెరిగింది.
- యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి వడ్డీ రేట్లను పెంచుతూ వస్తున్నది. వడ్డీ రేట్లు పెరిగితే విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను యూరోపియన్ బాండ్లలో పెట్టడానికి ఆసక్తి చూపుతారు. దీనివల్ల యూరోకు డిమాండ్ పెరిగి దాని విలువ పెరుగుతుంది.
- జర్మనీ, ఫ్రాన్స్ వంటి పెద్ద దేశాల ఆర్థిక వ్యవస్థలు అంచనాల కంటే మెరుగ్గా పని చేస్తున్నాయి. ముఖ్యంగా ఇంధన సంక్షోభం నుంచి యూరప్ వేగంగా కోలుకోవడం ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచింది.
- అమెరికాలో ఆర్థిక మాంద్యం వస్తుందనే భయంతో చాలా మంది ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను డాలర్ల నుంచి యూరోల వైపు మళ్లిస్తున్నారు. దీనినే పోర్ట్‌ఫోలియో డైవర్సిఫికేషన్ అంటారు.
- గతంలో యుద్ధం కారణంగా యూరో బాగా పడిపోయింది. కానీ, ఇప్పుడు యూరప్ ప్రత్యామ్నాయ ఇంధన వనరులను సమకూర్చుకోవడంతో ఆందోళనలు తగ్గి, కరెన్సీ మళ్లీ పూర్వవైభవాన్ని పొందుతోంది.